క్లుప్తంగా

ఘనంగా బల్లల పండగ



ఉత్సవంలో పాల్గొన్న పెద్దలు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెంలో శ్రీ కంచి కామాక్షమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి, బల్లలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నరవ అప్పలరాజు, ఉపాధ్యక్షులు కె.తాతారావు, పి.నాగరాజు, ఎస్.అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : హరే కృష్ణ, హరే రామ నామస్మరణ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

శ్రీవారి సన్నిధిలో నగర సీపీ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారి అంతరాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టీజే మోహన్ పాల్గొని 80 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.చంద్రశేఖరరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు ఎం.శంకర్, వి.రాంబాబు, వి.శ్రీనివాసరావు, రాము, లక్ష్మణ్, దివ్య, సాయి పాల్గొన్నారు.

పెందుర్తి వాసి అదృశ్యం



అప్పన్న (ఫైల్)

తగరపువలస : పెందుర్తి బీసీ కాలనీకి చెందిన మోతి అప్పన్న (50) ఈ నెల 9న ఆనందపురం వచ్చి అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. షాపులకు నిమ్మకాయలు, కలబంద మట్టలు కట్టడం, జ్యోతిష్యం చెప్పడం వంటి పనులతోపాటు కోయ వేషధారణలో ఉండే ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే ఆనందపురం సీఐ 73822 96908, 80746 66828కు తెలియచేయాలని కోరారు.

ముడసర్లోవ పార్కులో సందడే సందడి



ముడసర్లోవ పార్కులో స్నేహితుల సందడి

ఆరిలోవ: ముడసర్లోవ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. స్నేహితుల బృందాలు, పూర్వ విద్యార్థులు, యూనియన్ల సభ్యులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వనభోజనాలతో సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్కులో ఉత్సాహంగా గడిపారు.



వీధి దీపాలకు నోచుకోని విద్యుత్ స్తంభాలు

ఇరుకు రోడ్లు..
చెత్తతో నిండిన డ్రైన్లు..

పీఎంపాలెం గ్రామ పంచాయతీ ఏలుబడిలో ఈ కాలనీ ఏర్పడటంతో కాలనీలోని రహదారులు ఇరుగ్గా ఉండేవి. ఇంటి ముందర కనీస స్థలం కూడా లేదు. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు తప్ప మిగతావి ప్రయాణించడానికి వీలు కాని పరిస్థితి. వాహనాలకు పార్కింగ్ స్థలం అంటూ లేదు. అగ్ని ప్రమాదం వంటి విపత్తులు సంభవిస్తే భారీ వాహనాలు కాలనీలోకి వెళ్లలేకపోయేవి. అలాగే కాలనీలోని డ్రైనేజీల్లో చెత్తా చెదారాలు పేరుకుపోయాయి. అపారిశుధ్యం కారణంగా ఈగలు, దోమల బెడద అధికంగా ఉంది. పలు చోట్ల కొత్తగా విద్యుత్ స్తంభాలు వేశారు కానీ నెలలు గడిచిపోయినా ఇంత వరకూ వాటికి లైట్లు అమర్చలేదు. **రాత్రి వేళల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. వీధిలైట్లు లేకపోవడంతో స్థానికులు తరచూ కుక్కల దాడులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేస్తూనే ఉన్నారు.**



ఆర్‌హెచ్ కాలనీలోని ఇరుకు రోడ్లు



డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

సమస్యలు జాస్తి.. పరిష్కారం నాస్తి..

- దుస్థితిలో ఆర్‌హెచ్ కాలనీ
- శిథిలావస్థలో నీళ్ల ట్యాంకు
- చెత్తా చెదారాలతో నిండిపోయిన డ్రైన్లు
- ఇరుకు రహదారులతో ఇక్కట్లు



శిథిలమైన నీళ్ల ట్యాంకు

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని పీఎం పాలెం ఎన్ని కాలనీలుగా విస్తరించినప్పటికీ ఆర్‌హెచ్ కాలనీకి మాత్రం ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ప్రాంతాన్ని ఇప్పటికీ పల్లె వాసనలు వీడలేదు. ఇక్కడ మధ్య తరగతి వారితో పాటు కూలీ నాలీ చేసుకునే వారు కూడా ఉన్నారు. ఈ కాలనీ 80వ దశకంలో ఆవిర్భవించినా ఇప్పటికీ అనేక సమస్యలతో సతమతమవుతోంది.

కాలనీ పుట్టుక గురించి..

రహదారుల విస్తరణ, మురుగు వాడల నిర్మూలనలో భాగంగా 1984లో అప్పటి నగర పాలక సంస్థ నగరంలోని కొన్ని కుటుంబాలకు పునరావాసం కల్పించాలనుకుంది. అందులో భాగంగా 950 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా 48 గజాల చొప్పున లేఅవుట్లు వేశారు. అక్కయ్యపాలెం, గంగుల గెడ్డ, రైల్వే న్యూకాలనీ, కొబ్బరితోట ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అయితే ఈ ప్రాంతంపై ఆసక్తి లేకపోవడంతో కేవలం 400 మంది మాత్రమే అప్పటి ప్రభుత్వ సహాయంతో ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని ఆర్‌హెచ్ కాలనీ వాసులుగా స్థిరపడ్డారు. అప్పుడు ఈ ప్రాంతమంతా అడవిని తలపించేలా చెట్లు, చేమలతో నిండి ఉండేది. అనంతరం ఈ ప్రాంతం మహా విశాఖలో విలీనం కావడంతో దీనికి డిమాండ్ పెరిగింది. నివాస స్థలాల ధరలు ఎన్నో రెట్లు పెరగడంతో కొంత మంది ఇంటి స్థలాలు అమ్ముకున్నారు.

స్తంభాలకు లైట్లు బిగించండి..



కాలనీలో పలు చోట్ల కొత్తగా విద్యుత్ స్తంభాలు వేసి లైన్లు పునరుద్ధరించారు. వాటికి దీపాలు మాత్రం అమర్చలేదు. దీంతో రాత్రి సమయంలో వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి. వెంటనే వీధి దీపాలు పునరుద్ధరించాలి.

– సీహెచ్ రమణ, ఆర్‌హెచ్ కాలనీ, పీఎం పాలెం.

డ్రైన్లన్నీ పూడుకుపోయాయి..



కాలనీలోని డ్రైన్లు చెత్తా, చెదారాల వల్ల పూడుకుపోయాయి. దోమల వ్యాప్తి అధికంగా ఉంది. కలరా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

టి. అప్పారావు, ఆర్‌హెచ్ కాలనీ, పీఎం పాలెం

రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

తగరపువలస: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరిస్తున్నందున కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనుంది. సొంత భూమి కలిగిన రైతులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు ఇతర అనుబంధ సేవలు పొందడానికి ఈ విశిష్ట సంఖ్య తప్పనిసరని భీమిలి ఏవో బి.శివకోమలి తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం, వన్-బి, ఆధార్, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ పట్టుకుని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆమె సూచించారు. ఆదివారం కాపులుప్పాడ, నిడిగట్టు గ్రామాల్లో నమోదును పరిశీలించారు.

ఆనందపురంలో...

ఈ నెల 25తో ముగియనున్న రైతు విశిష్ట నమోదు సంఖ్యను ఇప్పటి వరకు ఆనందపురం మండలంలో 339 మందికి గాను 185 మంది నమోదు చేసుకున్నట్టు ఆనందపురం ఏవో చావా సంధ్యారత్న ప్రభ తెలిపారు. మిగిలిన రైతులు వెంటనే సంబంధిత పత్రాలతో రైతు సేవా కేంద్రాలను సందర్శించాలన్నారు.

ప్రత్యేక తరగతులను పరిశీలించిన డీఈవో



విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పద్మనాభం: మండలంలోని విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆదివారం జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలకు ఎలా సంసిద్ధం కావాలో విద్యార్థులకు వివరించారు. ఎస్‌ఏ-1 పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు షరిత పాల్గొన్నారు.

సంజీవయ్యకు మాల మహానాడు నివాళి



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాల మహానాడు ప్రతినిధులు

తగరపువలస: తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్యకు భీమిలి మండలం తాళ్లవలస ఎస్సీ కాలనీలో ఆదివారం మాల మహానాడు ప్రతినిధులు నివాళులర్పించారు. నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు బోని సన్నిబాబు ఆధ్వర్యంలో మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు మాట్లాడారు. ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా సంజీవయ్య నిస్వార్థంగా పని చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు పెన్షన్లు, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్ పెంపు వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా నిజాయతీగా పని చేసి నిరాడంబరమైన జీవితం గడిపారన్నారు. ఆయన వారసులు ప్రస్తుతం కాపలాదారులుగా పనిచేస్తున్నారన్నారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. బొడ్డు నరసింగరావు, ఎం.వి.శివ, కె.ఇ.వి.రవికుమార్, ఎస్.రాంబాబు, వై.రామారావు, బోని ప్రసాద్, బోని నరసింగరావు, టి.సిద్ధార్థ, వి.నూకరాజు, బోని శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పిల్లల్ని చదివించాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు

మధురవాడ: టెన్త్ పరీక్షలు సమీపిస్తుండడంతో ఇంటి దగ్గర కూడా పిల్లలు బాగా చదివేటట్టు చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం జి. రవి చెప్పారు. ఆదివారం విద్యార్థుల గృహాలు సందర్శించే కార్యక్రమంలో భాగంగా వాంబే కాలనీలోని పలువురు విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేట్టు తల్లిదండ్రులు చూస్తే మరింత బాగా తర్ఫీదు ఇవ్వగలమన్నారు. సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. ప్రకాష్‌బాబు, ఎన్‌వీఎస్ఎస్ మూర్తి, ఎస్. సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఎఫ్ కమిషనర్‌కు వినతి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యలపై సోమవారం కాంగ్రెస్ కార్మిక సంఘం, చిట్టివలస లేబర్ యూనియన్, టీఎన్‌టీయూసీ నాయకులు మర్రిపాలెంలోని పీఎఫ్ కమిషనర్‌ను కలవనున్నారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్, పెన్షన్లు, ఈపీఎఫ్ వ్యక్తిగత వివరాల మార్పులు, ఇతర సమస్యలపై చర్చించనున్నట్టు ఆయా కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

తప్పిన ప్రాణాపాయం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కొమ్మాది: గుడ్లవానిపాలెం బీచ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనం వద్దకు లారీలో తీసుకొచ్చిన గ్రానైట్ పలకలు అన్‌లోడింగ్ చేసే క్రమంలో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కూలీలపై పలకలు పడిపోయాయి. వీటి మధ్య ఇరుక్కున్న ఆ ఇద్దరు కూలీలు ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డారు. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన గణేష్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, లక్ష్మణ్ అనే యువకుడికి కాలు విరిగిపోయింది. ప్రమాద సమయంలో యువకులు పెద్దగా కేకలు వేయడంతో స్థానికుల సహాయంతో వారిని బయటికి తీసుకొచ్చి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీరు వృథా



వలందపేట పంప్ హౌస్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేట సంపు కమ్ పంప్ హౌస్ నుంచి నిత్యం తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. పంప్‌హౌస్ వెనుక వైపునకు తుప్పు పట్టడంతో తాగునీరు వృథాగా పోతోందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వృథాను అరికట్టాలని వలందపేట వాసులు కోరుతున్నారు.

శివరాత్రి విశిష్టతపై ప్రబోధ సేవా సమితి ప్రచారం



రామునాయుడుపేటలో ప్రచారంలో ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస : త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు శివరాత్రి విశిష్టతపై ఆదివారం భీమిలి మండలం రామునాయుడుపేట, ముద్దాడపేట, బోడమెట్టపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల విశిష్టతను వివరించారు. కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ శివలింగంపై ఉన్న మూడు విభూతిరేఖలు ఆత్మ, జీవాత్మ, పరమాత్మలకు గుర్తు అన్నారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొందడమన్నారు. ఇతరులకు జ్ఞానం తెలియచేయాలన్నారు. అందుకే శివరాత్రిని మోక్షరాత్రి అంటారన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బంగారుతల్లి, నరసయ్యమ్మ, వి.సురేష్, కె.రాజు, సత్యం, కె.సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలంపై కూటమి నాయకుల రుబాబు

రహదారికి స్థలం కావాలంటూ బెదిరింపులు



కూటమి నాయకులు రోడ్డు కోసం కావాలంటున్న శ్మశాన వాటిక స్థలం




శ్మశాన వాటిక స్థలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన శ్మశాన వాటిక స్థలంపై కూటమికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. మహరాజుపేట – పద్మనాభం రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 119/1లో సుమారు ఎకరం స్థలంలో ఉన్న శ్మశాన వాటికను ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన 250 కుటుంబాల వారు పూర్వం నుంచి వినియోగించుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.12 లక్షల నిధులతో ప్రస్తుతం శ్మశానవాటికలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతుండగా దాతలు ఎవరైనా సహకరిస్తే శ్మశానవాటిక లోపల షెడ్డు, బోరుబావి ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈలోగా పద్మనాభం మండలం రేవిడిలో కూటమికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలపై బెదిరింపులకు దిగారు. బీటీ రోడ్డు నుంచి శ్మశానవాటిక మీదుగా తన వెంచర్‌లోకి వెళ్లేందుకు దారి కావాలని డిమాండ్ చేస్తున్నాడు. తనకు కూటమి ప్రభుత్వంలో ప్రముఖులతో పరిచయాలు ఉన్నందున దారి ఇచ్చి తీరాలని ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో ఎస్సీ, బీసీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి రక్షణ లేని తమ శ్మశానవాటిక అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ నిధులు కేటాయిస్తే కూటమి ప్రభుత్వం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రహదారి కోసమని సుమారు 400 గజాల వరకు స్థలం కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనిపై భీమిలి రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మజ్జివలస ఎస్సీ, బీసీ కాలనీవాసులు కోరుతున్నారు.

వాలిని చంపేటప్పుడు ధర్మం తప్పలేదు

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: వాలిని సంహరించినప్పుడు శ్రీరాముడు ఎక్కడా ధర్మం తప్పలేదని, చనిపోవడానికి ముందు వాలి అడిగిన అనేక ప్రశ్నలకు శ్రీరాముడు సమాధానం చెబితే, తన తప్పు ఒప్పుకుని, తనకు ఈ శిక్ష సమంజసమేనని శ్రీరామునికి నమస్కరించి వాలి ప్రాణాలు వదిలిపెట్టాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనంలో వివరించారు. మధురవాడ గాయత్రి విద్యా పరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ రామాయణంలోని కిష్కింధ కాండపై ఆదివారం ప్రవచించారు. మొదట వాలితో సుగ్రీవుడు యుద్ధానికి వెళ్లగా రామలక్ష్మణులు చెట్టు చాటున నిలిచి ఎందుకు చంపలేదని సుగ్రీవుడు ప్రశ్నించడం, సుగ్రీవునికి శ్రీరాముడి అండ ఉందని జాగ్రత్తగా ఉండాలని వాలితో తార చెప్పడం, అయినా వినకుండా యుద్ధానికి వెళ్లడం వంటి అనేక ధర్మ సూక్ష్మాలను చాగంటి తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అటకెక్కిన పశువైద్యం



సంగివలసలో చర్మంపై బొడిపెలతో బాధపడుతున్న దూడ

తగరపువలస : భీమిలి నియోజకవర్గంలో పశువైద్యం అటకెక్కింది. అందుబాటులో లేని వైద్య సిబ్బంది, తీవ్రంగా ఉన్న మందుల కొరత మూగజీవాల పాలిట ప్రాణ సంకటంగా, పాడి రైతుల పాలిట గుదిబండగా మారింది. 1962 సంచార పశు వైద్యశాలకు ఫోన్ చేసినా వైద్యం అందడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలసకు చెందిన అక్కరమాని మంగరాజు దూడ ఒకటి నెల రోజులుగా చర్మంపై బొడిపెలతో బాధ పడుతోంది. ప్రైవేట్‌గా ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో సంచార వైద్యశాల సిబ్బందిని సంప్రదించగా సరైన చికిత్స అందడం లేదని మంగరాజు తెలిపారు. మందులు కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై పశు సంవర్థకశాఖ అధికారులు స్పందించి నాణ్యమైన పశువైద్యంతోపాటు మందులు పంపిణీ చేయాలన్నారు. పశు సంవర్థక శాఖ సేవలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయన్నారు.